DC తెలుగు
దక్కన్ డిజిటల్ మీడియా

డీసీ తెలుగు డిజిటల్ దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | బుధవారం 30 అక్టోబర్ 2024 | Digital paper



## 70 ఏళ్లు పైబడ్డ వారికి ఆయుష్మాన్ భారత్

- పథకాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ
- ఢిల్లీ, బెంగాల్లో అమలు చేయక పోవడంపై విచారం

**న్యూఢిల్లీ,అక్టోబర్29 డీసీ తెలుగు:**
దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. 'ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన' కింద తీసుకొచ్చిన ఈ సదుపాయాన్ని ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం

మిగతా 2వ పేజిలో..

## దీపావళి వేడుకలు అయోధ్య సిద్ధం

- సరయూ నదీ తీరంలో 'దీపోత్సవ్'
- లక్షలాది దీపాలు వెలిగించాలని నిర్ణయం

**అయోధ్య, అక్టోబర్29 డీసీ తెలుగు :**
దీపావళి వేడుకలకు పవిత్ర పుణ్యక్షేత్రం అయోధ్య నగరం ముస్తాబవుతోంది. ఒకేసారి లక్షలాది దీపాలు వెలిగించి ప్రపంచ రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. ఏటా దీపావళి పర్వదినానికి ముందు రోజు అయోధ్యలోని సరయూ నదీ తీరంలో 'దీపోత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగానే గతేడాది ఏకంగా 25 లక్షల దీపాలు ఒకేసారి వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించింది. అయితే ఈ ఏడాది 28 లక్షల దీపాలతో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాలని యూపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే అక్టోబర్ 30న జరిగే దీపోత్సవ్ వేడుకలకు అయోధ్యా నగరి ముస్తాబవుతోంది. సరయూ నదీ తీరంలో దీపోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 51 ఘాట్‌లలో ఒకేసారి 28 లక్షల దీపాలు వెలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 30 వేల మంది వాలంటీర్లు ఈ దీపోత్సవం కార్యక్రమంలో భాగం కానున్నారు. ఇక రామ మందిరం నిర్మాణం తర్వాత తొలి సారి జరుగుతున్న దీపావళి పండుగ కావడంతో ఈ దీపోత్సవాన్ని మరింత అద్భుతంగా నిర్వహించాలని

మిగతా 2వ పేజిలో..

## సిఎం చంద్రబాబుతో కపిల్ దేవ్ భేటీ

- గోల్ఫ్‌కోర్స్ ఏర్పాటుపై ఆసక్తి



**అమరావతి, అక్టోబర్29 డీసీ తెలుగు :**
భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్..ఎపి సిఎం చంద్రాబను ఉండవల్లి నివాసంలో కలుసుకున్నారు. ఎపిలో గోల్ఫ్‌కోర్స్ ఏర్పాటుకు సంబంధించి చర్చించినట్లు సమాచారం. ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి ఉండవల్లిలో సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో గోల్ఫ్ కోర్స్ ఏర్పాటుపై చర్చించారు. సమావేశం అనంతరం కపిల్ దేవ్ మీడియాతో మాట్లాడారు. క్రీడలపై సీఎం చాలా ఆసక్తిగా ఉన్నారు. గోల్ఫ్ గురించి ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఇండియన్ గోల్ఫ్‌కు అధ్యక్షుడిగా ఉన్నా. ఎక్కడ భూమి ఇస్తారనేది ప్రభుత్వానిదే నిర్ణయం. స్పోర్ట్స్ సిటీ ఇస్తే చాలా సంతోషిస్తా అని కపిల్ దేవ్ తెలిపారు. అనంతపురం, అమరావతి, విశాఖలో గోల్ఫ్‌కోర్సులు పెడతామని కేశినేని చిన్ని తెలిపారు. ఏపీ అంబాసిడర్‌గా ఉండాలని కపిల్‌దేవ్‌ను కోరాం. రాష్ట్రంలో గోల్ఫ్ అభివృద్ధి చేయాలనే యోచనలో ఉన్నాం. గోల్ఫ్ డ్రైవింగ్‌కు రేంజ్‌లు సిద్ధం చేస్తాం. తదుపరి సమావేశాల్లో దీనిపై నిర్ణయం తీసుకుంటాం. ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయంగా ఆడేలా చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్

మిగతా 2వ పేజిలో..

## కొనసాగుతున్న లోకేశ్ అమెరికా పర్యటన

- పెట్టుబడులే లక్ష్యంగా ప్రముఖులతో భేటీ
- మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో చర్చలు
- శంతను నారాయణన్‌తోనూ లోకేశ్ భేటీ
- ఆపిల్ సంస్థ కార్యాలయం సందర్శన



**అమరావతి,అక్టోబర్ 29 డీసీ తెలుగు :**
పెట్టుబడులే లక్ష్యంగా అమెరికాల పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పలువురు ప్రముఖులను కలిసి చర్చిస్తున్నారు. ఎపి పెట్టుబడులకు అనుకూలమని చెబుతున్నారు. తాజాగా రెండ్ మండ్‌లో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో పాటు శాన్ ఫ్రాన్సిస్కోలో అడోబ్ సీఈఓ శంతను నారాయణ్‌తో భేటీ అయిన లోకేష్... ఏపీలో పెట్టుబడులు

## ఏ ఒక్కరూ డయేరియాతో మరణించకూడదు

- ప్రస్తుతం అదుపులో ఉందన్న మంత్రి అనిత

**విజయనగరం, అక్టోబర్29 డీసీ తెలుగు:**
విజయనగరం జిల్లాలో ఇకపై డయేరియాతో ఏ ఒక్కరూ మరణించ కూడదని, అటువంటి మరణాలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను హెచ్చరించారు. డయేరియా ప్రస్తుతం అదుపులోకి వచ్చిందని, మరణాలపై విచారణ చేపడుతున్నామని తెలిపారు. డయేరియా విజృంభించి పలువురు మృతి చెందిన నేపథ్యంలో మంత్రి అనిత రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి గుర్ల గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. కాలువలను, తాగునీటి పైప్ లైన్లను, పారిశుధ్యాన్ని పరిశీలించారు. భూగర్భ జలాల కలుషితం గురించి ఆరా తీశారు. అనంతరం కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో సమీక్షించారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ వర్షాకాలం అనగానే డయేరియా, సీజనల్ వ్యాధులు సాధారణంగా వస్తాయని , ముందస్తు చర్యలతో వాటిని నివారించాలని తెలిపారు. వచ్చే 10 రోజులు అన్ని వాటర్ ట్యాంక్ లను శుభ్రపరచి, క్లోరినేషన్ చేయాలని తెలిపారు.గుర్లలో డయేరియా వచ్చిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందన్నారు. నీటి బావులు, చేతి బోర్లను వాడకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం వలనే ఈ రోజు ఈ దుస్థితి వచ్చిందని, డ్రైనేజ్ పై నుండి, పక్క నుండి వాటర్ పైప్‌లు వేశారని, అందుకే నీరు కలుషితమైందని తెలిపారు. చెత్త మీద పన్ను వేసి, ఎక్కడ చెత్త అక్కడ వదిలేశారన్నారు. జగన్ శవ రాజకీయాలు మాట్లాడుతున్నారని, ఆయన ముఖ్యమంత్రి హయాంలో ఉన్న కాలంలో ఆల్లగడ్డ, కృష్ణా, నెల్లూరు , చిత్తూరు, కర్నూలు వంటి జిల్లాల్లో చాలా మంది డయేరియాతో చనిపోయారని, ఏ రోజూ వారిని పరామర్శ చేయడానికి

మిగతా 2వ పేజిలో..

## ఆస్తుల పంపకం జరగనే లేదు

- షర్మిలకు అన్యాయం చేయడం తగదు
- వైఎస్ ఆస్తుల్లో ఇద్దరికీ సమాన వాటా ఉంది
- తల్లిగా ఇద్దరికీ న్యాయం జరగాలన్నదే ఆకాంక్ష
- అబద్దాలు చెబుతున్న వైవి సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి
- వైఎస్ అభిమానులకు భార్య విజయమ్మ బహిరంగ లేఖ



**అమరావతి, అక్టోబర్29 డీసీ తెలుగు :**
దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆస్తులు పంచారన్నది అవాస్తవమని ఆయన భార్య వైఎస్ విజయమ్మ తేల్చిచెప్పారు.తాను అడ్డుకోవడానికి ఎంత ప్రయత్నించినా.. జరగ కూడనివి అన్ని తన ముందే జరిగిపోతున్నాయని ఆమె ఆవేదన చెందారు. వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి ఎన్నో అసత్యాలు చెప్పారని అన్నారు. ఈ మేరకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులకు ఆయన సతీమణి విజయమ్మ బహిరంగ లేఖ రాశారు. అబద్దాల పరంపర కొనసాగుతుందని చెప్పారు. జగన్, షర్మిల పేరిట వైఎస్ కొన్ని ఆస్తులు పెట్టారని తేల్చిచెప్పారు. ఇది ముమ్మాటికీ ఆస్తులు పంపకం కాదని అన్నారు. షర్మిలకు వైఎస్సార్ ఆస్తులు ఇచ్చారని లిస్టు చదివారు. అలాగే జగన్ పేరిట పెట్టిన ఆస్తుల జాబితా కూడా చదివి ఉండాల్సింది. ఆడిటర్‌గా ఉన్న విజయసాయిరెడ్డికి అన్నీ తెలుసు. ఇంటి బంధువుగా ఎంవోయూపై వైవీసుబ్బారెడ్డి సంతకం చేశారు. మీడియాలో అవాస్తవాలు మాట్లాడటం బాధ కలిగించింది. అబద్దాల పరంపర కొనసాగకుండా ఉండేందుకే నిజం చెబుతున్నా. అమ్మగా నాకు ఇద్దరు సమానమే.. అలాగే వైఎస్సార్ మాట కూడా ముఖ్యమే. ఆస్తులు ఇద్దరు బిడ్డలకు సమానం అనేది నిజం. నలుగురు పిల్లలకు ఆస్తులు సమానంగా ఉండాలన్నది వైఎస్సార్ ఆజ్ఞ. బాధ్యత గల కొడుకుగా జగన్ ఆస్తులను సంరక్షించాలి. ఆ మేరకు వైఎస్సార్ చివరి రోజుల్లో ఆయనకు జగన్ మాట ఇచ్చారు. నాన్న నీ తర్వాత పాప మేలు కోరే వారిలో నేనే మొదటివాడిని అని.. వైఎస్సార్‌కు

మిగతా 2వ పేజిలో..

DC తెలుగు
దక్కన్ డిజిటల్ మీడియా

# దీపావళి వేడుకలు అయోధ్య సిద్ధం

**మొదటిపేజీ తరువాయి..** యూపీ సర్కార్ భావిస్తోంది. ఇందులో భాగంగానే రామ మందిర సముదాయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరి స్తున్నారు. బుధవారం సాయంత్రం 6:30 గంటలకు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. సరయూ హారతి ఇస్తారు. అనంతరం నది ఒడ్డున దీపోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని మొత్తం డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తూ దీపాలను లెక్కించనున్నారు. ఈ దీపోత్సవానికి అన్ని శాఖల మంత్రులు, ప్రభుత్వ అధికారులు హాజరుకానున్నారు. కార్యక్రమం అనంతరం లేజర్ షో ఏర్పాటు చేశారు.

## సిఎం చంద్రబాబుతో కపిల్ దేవ్ భేటీ



**మొదటిపేజీ తరువాయి..** క్రీడాకారులను వెలికి తీస్తాం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో గోల్ఫ్ కోర్స్ ఏర్పాటు, రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి విస్తృత కార్యక్రమాల గురించి చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి విజయవాడకు చేరుకున్న టీమిండియా మాజీ కెప్టెన్, మంగళవారం సీఎం చంద్రబాబుతో సమావేశం అయ్యారు. కాగా, ప్రస్తుతం విశాఖపట్నంలో ముడసర్లోవలో ఓ గోల్ఫ్ కోర్టు ఉందనే సంగతి తెలిసిందే. అమరావతిలో మరో గోల్ఫ్ కోర్ట్ ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## ఆశ్రమం నందు వృద్ధులకు అన్నదానం ఏర్పాటు




**చీరాల :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు జన్మదినం సందర్భంగా మంగళవారం చీరాల మున్సిపాలిటీ పరిధిలోని కోటయ్య అనాధ మరియు వృద్ధ ఆశ్రమం నందు కేక్ కట్ చేసి,అనాధ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కరణం వెంకటేష్ అని అన్నారు. పేద ప్రజల ప్రక్షాన నిలబడి ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తున్నందుకు వెంకటేష్ బాబు మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గొట్టిపాటి ఎబినేజర్,కంప అరుణ్,బత్తుల అనిల్,గొట్టిపాటి భాగ్యరాజు, కరణం యూత్ మరియు కరణం వారి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస మంగాపురంలో పవిత్రోత్సవాలు

**తిరుపతి, అక్టోబర్29 :** తిరుపతి శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పవిత్ర సమర్పణ చేశారు. స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల సేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను కల్యాణమండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రానాయానం నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం మూలవర్లకు, ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 70 ఏళ్లు పైబడ్డ వారికి ఆయుష్మాన్ భారత్

**మొదటిపేజీ తరువాయి..** ప్రారంభించారు. ధన్వంతరి జయంతి, తొమ్మిదో ఆయుర్వేద డే సందర్భంగా ఈ పథకానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, గర్భిణులు, చిన్నారుల వ్యాక్సినేషన్ కోసం ఉద్దేశించిన యూ–విన్ పోర్టల్ ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఆరు కోట్లమంది సీనియర్ సిటిజన్లకు ఈ పథకం ద్వారా లబ్ది చేకూరుతుందని అంచనా. ఆయుష్మాన్ కార్డు ఉన్న వృద్ధులు కుటుంబ ప్రాతిపదికన ఏటా రూ.5 లక్షల వరకు వైద్య సదుపాయం పొందుతారు. దీనికింద దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు కొత్త కార్డులు అందిస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్‌భారత్ పరిధిలో ఉన్న వృద్ధులకు ఇప్పుడు రూ.5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుంది. కుటుంబంలో 70 ఏళ్లపైబడిన వారు ఇద్దరు ఉంటే వారికి సగం, సగం ప్రయోజనం వర్తిస్తుంది. ప్రైవేటు వైద్యఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా కింద ప్రయోజనం పొందుతున్నవారూ ఈ రూ.5 లక్షల ప్రయోజనం పొందొచ్చు. పథకంలో లబ్ది పొందేందుకు పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయుష్మాన్ కార్డు సిద్ధమైన తర్వాత అధికారిక ఆమోదం లభించిన వెంటనే బీమా కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆధార్‌లో నమోదైన వయసు ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ ..రాజకీయ ప్రయోజనాలను ఆశించే ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ ను ఢిల్లీ , పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు అమలు చేయడం లేదని అన్నారు. ఢిల్లీ, పశ్చిమబెంగాల్‌లో 70 ఏళ్లు దాటిన వారికి సేవలందించ లేకపోతున్నందుకు వారికి తాను క్షమాపణలు చెప్పుకుంటున్నానని అన్నారు. ఆయుష్మాన్ యోజనలో ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేరలేదనీ, రాజకీయ వృత్తికి సంబంధించిన అడ్డుగోడల కారణంగా వారికి తాను సేవ చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ప్రజల ప్రయోజనాలను రాజకీయాల కోసం పణంగా పెట్టడం మానవత్వం అనిపించుకోదని హితవు పలికారు. వైద్య చికిత్స కోసం ఇళ్లు, భూములు, నగలు అమ్ముకున్న సందర్భాలు గతంలో చాలానే ఉండేవని, తీవ్రమైన వ్యాధుల విషయంలో అయితే చికిత్సకు అయ్యే ఖర్చు వింటేనే పేద ప్రజలు వణికిపోయే పరిస్థితి ఉండేదని ప్రధాని అన్నారు. పేద ప్రజలను వైద్యం చేయించుకోలేని నిస్సహాయత నుంచి బయటకు తీసుకురావాలనే ఆలోచన నుంచే ఆయుష్మాన్ బారత్ పథకం పుట్టిందని చెప్పారు.

# కొనసాగుతున్న లోకేశ్ అమెరికా పర్యటన

**మొదటిపేజీ తరువాయి..** పెట్టాల్సిందిగా కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రగతిశీల ప్రభుత్వం ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో ముందుకు సాగుతోందనీ, ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పెట్టుబడులకు అన్నివిధాల అనుకూలమైన ప్రాంతమని చెప్పారు. ముందుగా సత్య నాదెళ్లతో జరిగిన సమావేశంలో క్లౌడ్–ఆధారిత ప్లాట్‌ఫామ్‌లను అమలు చేయడం, డేటా అనలిటిక్స్ కోసం ఏఐని ఉపయోగించడం, సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడం, స్మార్ట్ సిటీ కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అనుసరించే డిజిటల్ గవర్నెన్స్ విధానాలకు మైక్రో సాఫ్ట్ సహకారాన్ని అందించాలని లోకేష్ కోరారు. ఏఐ ప్రాజెక్టులకు అనువుగా ఉన్న అమరావతిని ఏఐ క్యాపిటల్‌గా తయారు చేయాలని భావిస్తున్నామని, ఇందులో భాగంగా అమరావతి లో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని లోకేష్ వివరించారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, డైనమిక్ టెక్ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, వ్యూహాత్మక భాగస్వామ్యం, ఆవిష్కరణల కోసం ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయాల్సింది గా కోరారు. ఏపీలో నెలకొన్న మౌలిక సదుపాయాలు, సాంకేతిక పర్యావరణ వ్యవస్థను ఒకసారి మా రాష్ట్రానికి వచ్చి పరిశీలించమని కోరిన లోకేష్ ఏపిలో పెట్టుబడులకు గల అవకాశాలను పరిశోధించాలని, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి ప్రణాళికల్లో అధునాతన సాంకేతికను ఏకీకృతం చేయడానికి భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ మైక్రోసాఫ్ట్ సీఈఓను కోరారు. లోకేష్‌తో భేటీ సందర్భంగా సత్య నాదెళ్ల మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్ సంస్థ సాఫ్ట్‌వేర్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా ఉందని చెప్పారు. అనంతరం శాన్ ఫ్రాన్సిస్కోలో అడోబ్ కంపెనీ సీఈవో శంతను నారాయణ్‌తో లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శంతను నారాయణన్ మాట్లాడుతూ అడోబ్ కంపెనీ ప్రస్తుతం డిజిటల్ మీడియా, క్లౌడ్–ఆధారిత సేవల్లో అగ్రగామిగా ఉంది. ఫోటోషాప్, అక్రోబాట్, ఇల్లస్ట్రేటర్ వంటి సాధనాలను మరింత అందుబాటులోకి తెచ్చామని, సృజనాత్మకత, డాక్యుమెంట్ ఉత్పాదకత, ఏఐ–పవర్డ్ ఇన్నోవేషన్స్ రంగంలో ఎప్పటికప్పుడు అప్ డేటెడ్ వెర్షన్స్ ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. అలాగే శాన్‌ఫ్రాన్సిస్కోలోని యాపిల్ సంస్థ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ప్రియా బాలసుబ్రహ్మణ్యాన్ని కలిశారు. యాపిల్ యాక్టివిటీస్ విస్తరించడానికి ఏపీ అనుకూలమైన ప్రాంతంగా చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కోరిన చోట స్థలం ఇస్తామని తెలిపారు. తయారీ యూనిట్ స్టార్ట్ చేయాలని ఆహ్వానించారు. కావాల్సిన ప్రాంతంలో భూమితోపాటు కావాల్సిన సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. అత్యంత నైపుణ్యం ఉన్న మానవ వనరులు ఉన్నాయని వాళ్లకు వివరించారు. ఏపీతో కలిసి పని చేసేందుకు ప్రియా సుబ్రహ్మణ్యం సానుకూలంగా స్పందించారని చెబుతున్నారు.

# ఆస్తుల పంపకం జరగనే లేదు

**మొదటిపేజీ తరువాయి..** జగన్ మాట ఇవ్వడం కూడా నిజం. ఈ విషయం 'నాలో నాతో వైఎస్సార్' పుస్తకంలో ఎప్పుడో రాశానని విజయమ్మ స్పష్టం చేశారు. అమ్మగా నాకు ఇద్దరూ సమానమే. అలాగే ఆస్తులు ఇద్దరికీ సమానమనేది నిజం. అయితే ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు బాధ కలిగిస్తున్నాయి. తల్లిగా అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండటం నా విధి, ధర్మం. ఇంట్లో ఒకబిడ్డకు ఇంకోబిడ్డ అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం కష్టం. హక్కు ఉంది కాబట్టే పాప షర్మిలకు రూ.200 కోట్ల డివిడెండ్లు ఇచ్చారు. పాపకు హక్కు ఉంది కాబట్టే ఎంవోయూ రాసుకున్నారు. ఎంవోయూలో ఉన్న సరస్వతి షేర్స్ వందశాతం.. ఎంవోయూలో లేని యలహంక ప్రాపర్టీ వందశాతం వెంటనే ఇస్తానని.. జగన్ అప్పుడే మాట ఇచ్చి సంతకం పెట్టాడు. వైఎస్సార్ ఉన్నప్పుడు ఆస్తులు పంచలేదు.. అందరం కలిసే ఉన్నాం. ఇప్పుడు ఉన్నవన్నీ కుటుంబ ఆస్తులేనని వివరించారు. అన్నీ తెలిసీ ఇప్పుడు విజయసాయిరెడ్డి అవాస్తవాలు మాట్లాడారు. వీటన్నింటికీ అప్పుడు.. ఇప్పుడూ నేనే సాక్షిని. అటాచ్‌మెంట్‌లోలేని ఆస్తుల్లోనూ పాపకు అన్యాయం జరిగింది. రాజకీయాల్లో జగన్ చెప్పినట్టే పాప చేసింది. ఇష్టం వచ్చినట్టు మాట్లాడవద్దని అందరినీ కోరుతున్నానని విజయమ్మ తన లేఖలో వెల్లడించారు.


# ఏ ఒక్కరూ డయేరియాతో మరణించకూడదు

**మొదటిపేజీ తరువాయి..** వెళ్ల లేదని అన్నారు . ఈ రోజు రాజకీయంగా బురద జల్లాలని చూస్తున్నారని విమర్శించారు. జగన్ నష్ట పరిహారం ప్రకటిస్తున్నారుగాని ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ నిర్వీర్యం అయిందని అనడం సరైనది కాదని, ఆయన కేవలం ఎమ్మెల్యేమాత్రమేనని అయినా జెడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీ ఇస్తున్నామని తెలిపారు. జగన్ అమ్మ వద్దు–ఆస్తి ముద్దు అంటూ వ్యవహరిస్తున్నారని, తల్లికి, చెల్లికి విలువ ఇవ్వని వాడు, రాష్ట్ర ప్రజలకు ఏమి విలువ ఇస్తాడని అన్నారు. జగన్ జైలులో ఉన్నప్పుడు ఆయన తరుపున బయట పాదయాత్ర చేసిన ఏకైక మహిళ షర్మిలన్నారు. సొంత బాబాయిని చంపేసి, సొంత చెల్లితో రాజకీయం చేశాడని విమర్శించారు. అవినాష్ రెడ్డి, భారతి రెడ్డి, తన గురించి మాట్లొడద్దని షర్మిలను భయ పెడుతున్నాడని అన్నారు. రాజకీయాలకు పనికి రానీ ఏకైక వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. తాము డైవర్షన్ రాజకీయాలు చేయడం లేదని, అధికారంలో ఉన్న తమకు ఆ అవసరం లేదని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను జగన్ తన సొంత అవసరాలకు ఖర్చు చేశారని ఆరోపించారు. గ్రామాలను అభివృద్ధి చేయలేదన్నారు. అందువల్లే వైసిపి సర్పంచ్‌లే ప్రభుత్వంపై కోర్టుకు వెళ్లారని అన్నారు. సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# ధ్యానం అంటే చేసే పని పైన ధ్యాస

**(బాపట్ల):**
ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం సర్దార్ బేగ్ అధ్యక్షతన బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు దీక్షారంభం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పరిశీలనాత్మక మనస్తత్వవేత్త పిన్నబోయిన శ్రీమన్నారాయణ చే మంగళవారం ఉదయం ప్రేరణా చర్చ నిర్వహించారు. చర్చా కార్యక్రమం లో భాగంగా విద్యార్థులకు జీవితంలో ఎదుగుదలకు కావాల్సిన ముఖ్య సూచనలు మరియు సలహాలు ఇవ్వడం జరిగింది. మనిషి నిద్ర లేచిన దగ్గర నుండి తిరిగి నిద్రపోయే వరకు ధ్యానం లో ఉండి పని చేయాలి, ధ్యానం అంటే చేసే పని పైన ధ్యాస, నిరంతరం ధ్యానం తో ధ్యాస పెట్టి పని చేయాలి అని అన్నారు. సమయపాలన, నైపుణ్యం, క్రమశిక్షణ, ప్రతిరోజు కొత్త విషయాలను నేర్చుకోవడం అలవాటు చేసుకునే మొదలగు అంశాలను గురించి వివరించారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి కళాశాల మొట్ట మొదటి బ్యాచ్ (2003) విద్యార్థి అయిన డాక్టర్ ఎ. పోషాద్రి, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్ర, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంచే అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ మరియు అనుబంధ రంగాలలో ఆవిష్కరణలు, ప్రారంభ అవకాశాలపై మరియు ఆహార నిపుణుడిగా విద్యార్థుల బాధ్యతలను మొదలగు విషయాలను విద్యార్థులకు తెలియచేసారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు ఓ. ఏ. ఎం. డాక్టర్ యన్. వినోద నిర్వహించిన ఈ కార్యక్రమంలో బోధనా మరియు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు





## ఎస్ఎస్ఎంబీపై ఫస్ట్ అప్‌డేట్


## ఎడారిలో తిరుగుతున్న ఫొటో షేర్ చేసిన రాజమౌళి



దర్శకధీరుడు రాజమౌళి తన తాజా చిత్రం గురించి అప్డేట్ ఇచ్చారు. మహేశ్‌బాబు హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ సినిమా పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం చిత్రబృందం దృష్టి అంతా ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులపైనే ఉంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని టాక్. అయితే ఈ చిత్రం గురించి ఇప్పటిదాకా ఏ విషయం అఫీషియల్‌గా బయటకు రాలేదు. తాజాగా దర్శకుడు రాజమౌళి ఓ అప్‌డేట్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా ఎడారి ప్రాంతంలో తిరుగుతున్న ఫొటో షేర్ చేసి 'కనుగొనడం కోసం తిరుగుతున్నా' అని క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆయన మహేశ్ సినిమా కోసం లొకేషన్స్ సెర్చ్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. త్వరలోనే అప్‌డేట్ షేర్ చేయాలని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. అయితే ఈ చిత్రంలో జంతువులు ఎక్కువగా కనిపిస్తాయి అని ఇటీవల జక్కన్న హింట్ ఇచ్చారు. తాజాగా ఆయన పోస్ట్ చేసిన ఫొటోలో జంతువుల గుంపు కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. కనీసం ఇలాగైనా అప్‌డేట్ ఇచ్చారంటూ అభిమానులు ఆనందిస్తున్నారు. ఎస్-ఎస్ఎంబీ 29 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రంలో మహేశ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఆ పాత్ర ఇప్పటికే సన్నద్ధమయ్యారు. ఈ ప్రాజెక్ట్ కోసం రాజమౌళి ఏఐ టెక్నాలజీని వినియోగించనున్నట్లు వార్త?ని వినిపించాయి. దీనికోసం ఆయన ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు తెగ వైరలైంది. సినిమాలోని కొన్ని పాత్రలు, జంతువుల కోసం ఆయన ఏఐ టెక్నాలజీని ఉపయోగించనున్నారని తెలుస్తోంది. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## సంక్రాంతి పోటీ నుంచి తండేల్ ఔట్





'కస్టడీ' సినిమా తర్వాత అక్కినేని నాగ చైతన్య నటిస్తోన్న కొత్త చిత్రం తండేల్. మెచ్చుటగా మూడోసారి దర్శకుడ చందూ మొండేటితో జత కట్టిన ఆయన ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. సాయి పల్లవి రెండోసారి చైతూతో చేస్తుండగా దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాని పాన్ ఇండియా ప్రాజెక్ట్ రిలీజ్ చేయడానికి గీత ఆర్ట్స్ ప్లాన్ చేసింది. అయితే ఈ సినిమా విడుదల విషయంలో అనేక వార్తలు వినిపిస్తున్న సమయంలో ఈ చిత్ర దర్శకుడు ఓ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో తంగేల్ రిలీజ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జనవరికి తండేల్ సినిమా విడుదలకు సిద్దంగా ఉంటుందని, మరో 10 రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని అన్నారు. ఈ డిసెంబర్ 25కి సినిమా రిలీజ్‌కు రెడీ కాదని స్పష్టం చేశారు. అయితే ఒకవేళ రామ్ చరణ్ సినిమా గేమ్ చేంజర్ విడుదల ఉందని ఉందని అల్లు అరవింద్, వెంకీ మామ సినిమా వస్తుందని చైతన్య ఆలోచిస్తే సంక్రాంతికి కూడా తండేల్ మూవీ రిలీజ్ ఉండదని అన్నారు. దీంతో ఇప్పుడు ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. అక్కినేని ఫ్యామిలీకి ఎంతో కలిసొచ్చే సంక్రాంతికి తండేల్ సినిమా విడుదలపై అనుమానాలు రావడంతో సినిమా రిలీజ్ డేట్‌పై అప్డేట్ ఇవ్వాలంటూ నాగచైతన్య ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ సినిమాలపైన ఉన్న శ్రద్ధ మీ సినిమా రిలీజ్‌పై లేదు అటూ చురకలు పెడుతునే సినిమా థియేటర్ రిలీజ్ ఏమొద్దు డైరెక్టు ఓటీటీ రిలీజ్ చేయడంటూ ఓ రేంజ్‌లో కామెంట్లు చేస్తున్నారు. ఇదిలాఉండగా.. ఇప్పటికే సంక్రాంతి పోటీలో నుంచి చిరంజీవి 'విశ్వంభరస తప్పుకోవడంతో రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్ విడుదలకు రెడీ అవుతుండగా, బాలయ్య, బాబీ సినిమా, మరోవైపు వెంకీ, అనిల్ రావిపూడి సినిమాలు బరిలో ఉన్నాయి.

## శ్రీముఖి అందం ముందు హీరోయిన్లు కూడా దిగదుడుపే

## వైరల్ అవుతున్న శ్రీముఖి ఫొటోలు




బుల్లితెరపై స్టార్ యాంకర్లలో శ్రీముఖి ఒకరు. ఈ అమ్మడి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఓవైపు టీవీల్లో వరుసగా రియాల్టీ షోస్ చేస్తూనే.. మరోవైపు సినిమాల్లో కీలకపాత్రలు పోషిస్తుంది. స్టార్ యాంకర్ గా రాణిస్తున్న ఈ చిన్నదానికి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. స్టేజ్ అల్లరి.. చలాకీ తనంతో యాంకర్ గా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఈ బ్యూటీకి సోషల్ మీడియాలో భారీగా ఫాలోయింగ్ ఉంటుంది.స్టార్ యాంకర్ గా రాణిస్తున్న ఈ చిన్నదానికి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. స్టేజ్ అల్లరి.. చలాకీ తనంతో యాంకర్?గా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఈ బ్యూటీకి సోషల్ మీడియాలో భారీగా ఫాలోయింగ్ ఉంటుంది. టీవీ షోలతో ఫుల్ బిజీగా ఉంటున్న ఈ బ్యూటీ.. సినిమాల్లోనూ నటిస్తూ ఆకట్టుకుంటుంది. మొన్నామధ్య మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో హీరోయిన్ ఫ్రెండ్ గా నటించి మెప్పించింది ఈ వయ్యారి భామ. టీవీ షోలతో ఫుల్ బిజీగా ఉంటున్న ఈ బ్యూటీ.. సినిమాల్లోనూ నటిస్తూ ఆకట్టుకుంటుంది మొన్నామధ్య మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో హీరోయిన్ ఫ్రెండ్ గా నటించి మెప్పించింది ఈ వయ్యారి భామ. రోజూ నెట్టింట సందడి చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. రీల్స్.. ఫన్నీ వీడియోస్ చేస్తూ ఫ్యాన్స్ కు టచ్ లో ఉంటుంది.ఈ అమ్మడు ఇన్ స్టాలో షేర్ చేసే ఫోటోలకు మంది క్రేజ్ ఉంటుంది. ఈ ఫోటోలకు వేలల్లో లైక్స్ , షేర్స్ ఉంటాయి. రోజూ నెట్టింట సందడి చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. రీల్స్.. ఫన్నీ వీడియోస్ చేస్తూ ఫ్యాన్స్ కు టచ్ లో ఉంటుంది.ఈ అమ్మడు ఇన్ స్టాలో షేర్ చేసే ఫోటోలకు మంది క్రేజ్ ఉంటుంది. ఈ ఫోటోలకు వేలల్లో లైక్స్ , షేర్స్ ఉంటాయి.



## డిసెంబరు 20న విడుదల కానున్న 'శారీ'

### భారీగా ప్లాన్ చేసిన దర్శకుడు రాంగోపాల్ వర్మ





ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ డెన్ నుంచి వస్తున్న 'శారీ' చిత్రం డిసెంబరు 20న థియేటర్‌లో విడుదలకానుంది. ఈ మేరకు మేకర్స్ అధికారికంగా రిలీజ్ డేట్ వెల్లడించారు. ఇందులో యువనటి ఆరాధ్య దేవి హీరోయిన్‌గా నటించగా, సత్య యాదు హీరో. పలు వాస్తవిక సంఘటనల ఆధారంగా ఈ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగా రూపొందించారు. తమిళం, తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ చిత్రానికి గిరి కృష్ణ కమల్ దర్శకుడు. ఆర్జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమైంది. అతి ప్రేమ భయంకరంగా ఉంటుందనేది ఈ సినిమా మూల కథ. సోషల్ మీడియాలో జరిగే కొన్ని ఊహించని విషయాల వల్ల సమాజంతో పాటు వ్యక్తిగత జీవితంలో జరిగే మార్పులు ఇందులో ప్రధానంగా ప్రస్తావించారు. ఇందులో భయపెట్టే ప్రేమికుడి పాత్రలో సత్య యాదు నటించారు. %కాగా.. ఈ చిత్రంలో నటించిన ఆరాధ్య దేవి కేరళకు చెందిన వర్ధమాన నటి. గతంలో శ్రీలక్ష్మి అనే పేరుతో పరిశ్రమకు పరిచయమైంది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎవరో తనకు ఫార్వార్డ్ చేసిన ఆరాధ్య రీల్స్ చూసి ఈమెను కనిపెట్టి కొత్త పేరు పెట్టి మరీ ఈ 'శారీ' చిత్రంలో హీరోయిన్‌గా రాంగోపాల్ వర్మ ఎంపిక చేయడం గమనార్హం. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం పోస్టర్లు ప్రేక్షకులను అమితంగా ఆకర్షించిన విషయం తెల్సిందే.

## సిగ్గుపడే సూర్య కంగువా చేశాడు

### సీనియర్ నటుడు, సూర్య తండ్రి శివకుమార్



తన కుమారుడు, హీరో సూర్య సినీ కెరీర్‌లోనే ది బెస్ట్ సినిమాగా 'కంగువా' ఉంటుందని 'కోలీవుడ్ మార్కండేయగా' గుర్తింపు పొందిన సీనియర్ నటుడు, సూర్య తండ్రి శివకుమార్ కితాబిచ్చారు. సిరుత్తై శివ దర్శకత్వంలో సూర్య - దిశా పటానీ జంటగా నటించిన చిత్రం 'కంగువా' తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ సహా పదికిపైగా భాషల్లో తెరకెక్కింది. స్టూడియో గ్రీన్ పతాకంపై బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మించారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడు. నవంబరు 14వ తేదీ ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ వేడుకకు చిత్ర బృందంతో పాటు శివకుమార్, కేఎస్ రవికుమార్, ఏఎల్ విజయ్, ఆర్‌జే బాలాజీ, కార్తీక్ సుబ్బరాజ్, శక్తివేల్, ధనుంజయన్, హీరో కార్తీ, ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు, నటులు నట్టికుమార్, బోస్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. 'నలుగురు మధ్య మాట్లాడేందుకు ఎంతో సిగ్గు, బెరుకుతో వణికిపోయే మా కుట్టిపయ్య (చిన్నోడు) ఇపుడు 'కంగువా' చిత్రంలో నటించాడు. కెరీర్ ఆరంభానికి ముందుకు కుటుంబ పోషణ కోసం అనేక పనులు చేశారు. అనేక మంది అనేక మాటలు అన్నారు. వాటినన్నింటినీ దిగమింగి, అంకితభావంతో ఈ స్థాయికి చేరుకున్నాడు. రెండు దశాబ్దాల సూర్య సినీ కెరీర్‌లో 'కంగువా' ది బెస్ట్ మూవీగా ఉంటుంది' అన్నారు. హీరో కార్తీ మాట్లాడుతూ.. 'అభిమానులను సంతృప్తి పరిచేందుకు అన్న సూర్య చాలా శ్రమిస్తారు. ఆయన ఈ స్థాయికి చేరుకోవడం కారణం ఆయన అంకితభావమే అన్నారు. దర్శకుడు సిరుత్తై శివ మాట్లాడుతూ, 'లొకేషన్‌లో నేను ప్రశాతంగా, ఆత్మవిశ్వాసం, నిగ్రహం, ధైర్యంతో ఉంటానని ప్రతి ఒక్కరూ చెబుతుంటారు. దీనికి కారణం అగ్రహీరో అజిత్ కుమార్. ఆయనతో పనిచేసిన సమయంలో నన్ను అర్థం చేసుకుని ప్రోత్సహించిన తీరే నన్ను ఇలా నిలబెట్టింది. ఆ తర్వాత నా వద్ద పనిచేసే నలుగురు అసిస్టెంట్ దర్శకులు. ఆ నలుగురే 15 మంది అసిస్టెంట్ డైరెక్టర్లు చేసే పనిని రేయింబవుళ్ళు శ్రమించి చేస్తారు. ఈ చిత్రం ఇంత గ్రాండ్‌గా వచ్చిందంటే దానికి కారణం ఆ నలుగురు అసిస్టెంట్ డైరెక్టర్లే. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడానికి ప్రధాన కారణం నా స్నేహితుడు ఆదినారాయణ. రెండోది చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా. భారీ బడ్జెట్, పీరియాడిక్ చిత్రమైనా ఏమాత్రం వెనుకంజ వేయలేదు. జ్ఞానవేల్ రాజా నిర్మాతగా సిరుత్తై సినిమా తెరకెక్కించాను. అప్పటి నుంచి నా పేరు సిరుత్తై శివగా మారిపోయింది. 'కంగువా' తర్వాత మరో కొన్నేళ్ళ వరకు నా పేరు ఇండస్ట్రీలో నిలబడిపోతుందన్నారు. హీరో సూర్య మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో విలన్‌గా బాబీ డియోల్ నటించడం మరిచిపోలేనిది. గొప్ప నటుడైనప్పటికీ ప్రతి ఒక్కరినీ కలుపుకుపోయారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్ళింది. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అన్నారు. ఈ సందర్భంగా దేవీశ్రీ ప్రసాద్ ఆలపించిన పాట అభిమానులతో పాటు అహుతులను అలరించింది.